ప్రశాంతంగా ముగిసిన గ్రూప్–1 మెయిన్స్


కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద అభ్యర్థులు


దివ్యాంగ పూర్వ మిత్రులు

మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రూప్–1 మెయిన్స్ ఆదివారంతో ప్రశాంతంగా ముగిశాయి. 114మంది దివ్యాంగులు, నలుగురు ఇతరులు మొత్తం 118 మందికి 92 మంది హాజరుకాగా 26 మంది గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు. చివరి రోజు కావడంతో దివ్యాంగులు, లేఖరులు సంతోషం వ్యక్తం చేశారు.

దివ్యాంగ అభ్యర్థుల గ్రూప్ ఫొటో

కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రూప్–1 మెయిన్స్ ముగియడంతో పలువురు దివ్యాంగ అభ్యర్థులు కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ వద్ద ఫొటోలు దిగారు. వీరంతా కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, నల్గొండ పలు వివిధ జిల్లాలకు చెందిన వారు. వీరంతా బేగంపేటలోని ఓ బ్లైండ్ స్కూల్లో పదో తరతి వరకు కలిసి చదువుకున్నారు. మళ్లీ గ్రూప్–1 పరీక్షలకు కలుసుకోవడంతో ఉత్సాహంగా గడిపారు.

గ్యార్మీ షరీఫ్ ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే


ప్రార్థనలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: చింతల డివిజన్ వివేకానంద్‌నగర్‌లో ఆదివారం ఉర్స్–ఈ–షరీఫ్ సందర్భంగా గ్యార్మీ షరీఫ్ ఉత్సవాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత సామరస్యానికి ప్రతీకగా గ్యార్మీ ఉత్సవాలు నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నరేశ్, అలీ, ఆసిఫ్, మహబూబ్, చాంద్ పాషా, బాదే మస్తాన్, ఖదీర్, విఠల్, బిల్లా వెంకట్, మహమ్మద్ అలీ, బ్రహ్మం పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు తెలంగాణ రాష్ట్రం నుంచి కుత్బుల్లాపూర్ కు చెందిన పూజిత, హేమ, దివ్య ఎంపికయ్యారు. ఈ సందర్భంగా యోగా గురు మల్లేశ్, ఇన్‌స్ట్రక్టర్ విజయ్‌కుమార్‌తో కలిసి షాపూర్‌నగర్‌లోని నివాసంలో మాజీ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. చిన్నారులను అభినందించిన శ్రీశైలంగౌడ్ జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

మత సామరస్యానికి ప్రతీక

రంగారెడ్డినగర్: గ్యార్మీ ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత రెడ్డి అన్నారు. గాంధీనగర్‌లో శనివారం రాత్రి గ్యార్మీ ఉత్సవాల్లో ఆయన పాల్గొని చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సోదరభావాన్ని పెంపొందించే గ్యార్మీ ఉత్సవాలు రాష్ట్ర వ్యాప్తంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు శివ కుమార్, సుబ్బారెడ్డి, భాస్కర్ రెడ్డి, గ్యార్మీ ఉత్సవ కమిటీ సభ్యులు ఉస్మాన్, తాహేర్ ఖాన్, ఇర్ఫాన్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.


పద్మానగర్ ఫేజ్–1 నూతన కమిటీ సభ్యులు

ఏకగ్రీవంగా నూతన ఎన్నిక

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మానగర్ కాలనీ ఫేజ్–1 సంక్షేమ సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ సలహాదారులు ముత్యాలు, వెంకటేశ్వర రావు, శివనాగిరెడ్డి, ఖాసీం, జయసింహారెడ్డి సమక్షంలో జరిగిన సమావేశానికి 400 మంది కాలనీసభ్యులు పాల్గొన్నారు. సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా సత్తిరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా దయాకర్, ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దేవేందర్‌రెడ్డి, కోశాధికారిగా ప్రసాద్, సహాయ కోశాధికారిగా అరవింద్ యాదవ, సంయుక్త కార్యదర్శులుగా సత్యం, కృష్ణారావు, వేణు, మోహన్, సుబ్బారెడ్డి, కార్యనిర్వాహణ కార్యదర్శులుగా రంగ సుబ్బయ్య, భాస్కర్ రెడ్డి, రమణరెడ్డి, సందీప్‌రెడ్డి, ఠాకూర్ వినోద్‌సింగ్‌తో పాటు 14 మందిని ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎన్నుకున్నారు. అదేవిధంగా సోషల్ మీడియా కన్వీనర్‌గా సుధాకర్‌ను నియమించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ కాలనీవాసులను కలుపుకుని స్థానికంగా అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమం గాలికొదిలేసిన కాంగ్రెస్

- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- నాయకులు, కార్యకర్తలతో సమావేశం


నాయికులు, కార్యకర్తలతో సమావేశమైన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ఆవుల రవీంద్‌రెడ్డి

కూకట్‌పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం గాలికి వదిలేసిందని, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో ఉండి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచించారు. క్యాంపు కార్యాలయంలో బాలానగర్ డివిజన్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలతో ఆదివారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మున్సిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్ చేసిన అభివృద్ధిని ప్రజలు మర్చిపోలేదని, హైదరాబాద్‌ను ప్రపంచంలోనే అత్యుత్తమైన నగరంగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. గత పది నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కనీస వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనుల నిర్వహణకు రూపాయి కూడా వెచ్చించలేని స్థితికి జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ విభాగాలు చేరాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో వేల కోట్ల నిధులతో కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో ఏ ఎన్నికలు వచ్చినా మళ్లీ బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, అధ్యక్షుడు శాఖయ్య,ఖాజా,సుధాకర్‌రెడ్డి, నాయకులు, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌వి కక్షపూరిత రాజకీయాలు'

కూకట్‌పల్లి: బీఆర్ఎస్‌కు పెరుగుతున్న ఆదరణను చూసి తట్టుకోలేక కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతూ అసంబద్ధమైన కేసులు నమోదు చేయడంతో పాటు అక్రమంగా తమ పార్టీ ఎమ్మెల్యేలను అరెస్టు చేయిస్తున్నదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు.రాజ్ పాకాల తన కుటుంబ సమేతంగా తన నివాసంలో చేసుకున్న పార్టీని రేవ్ పార్టీ అంటూ కుటుంబ సభ్యులను కూడా అవమానకరంగా చిత్రీకరించేలా కుట్రపూరితంగా కాంగ్రెస్ ప్రభుత్వం డైరెక్షన్‌లో పోలీసులు వ్యవహరిస్తున్నారని ప్రజలు కూడా గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. హైడ్రాతో పాటు మూసీనది వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వం అప్రతిష్టపాలు కావడంతో దాని నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే అక్రమంగా కేసులు నమోదు చేస్తూ దుష్ట రాజకీయాలకు పాల్పడుతుందని విమర్శించారు. ఓ ఇంట్లో జరిగిన ఫంక్షన్‌ను బీఆర్ఎస్ పెద్దలకు ముడిపెట్టడాన్ని అడ్డుకుంటున్న ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

అంబేడ్కర్ జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలి

ఘట్‌కేసర్: అంబేడ్కర్ రచనలు చదివి నేటి యువత జ్ఞానవంతులు కావాలని కౌన్సిలర్ శశిక శదేవేందర్ అన్నారు. ఆదివారం అంబేడ్కర్ ఆలోచన విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ బాధ్యుడు మీసాల అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్ 18 డిగ్రీలు చదివి ప్రపంచంలోనే మేధావిగా ఖ్యాతికెక్కాడని, ఆయన జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసుకొని సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దాసు, లక్ష్మారెడ్డి, రాందాసు, ఆంజనేయులుపంతులు, రాధాకృష్ణ ముదిరాజ్, దేవేందర్ ముదిరాజ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీపీని సందర్శించిన ఎమ్మెల్యే మాధవరం


నాచారంలోని ఎస్టీపీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి ఉప్పల్, నాచారంలోని ఎస్టీపీలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వహయాంలో నిత్యం ఏదో ఒక అభివృద్ధి పనులు జరిగేవని, హైదరాబాద్ రూపురేఖలు మార్చేలా ప్రణాళికలు రూపొందించామని అందులో భాగంగా మురుగునీటి శుద్ధి ప్లాంట్లను ఎక్కడికక్కడ ఏర్పాటు చేశామని, ప్రస్తుతం పనులు పూర్తయి అందుబాటులోకి వచ్చాయని గుర్తు చేశారు. మౌలిక సదుపాయాల కల్పనలో నాటి సీఎం కేసీఆర్ వెనుకడుగు వేయలేదని కేటీఆర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శంభీపూర్‌రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాచుపల్లి ఇన్‌స్పెక్టర్ ఉపేందర్‌కు ప్రశంసాపత్రం


సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న ఇన్‌స్పెక్టర్ ఉపేందర్

నిజాంపేట్: క్రిమినల్ కేసులను చేధించి ఇద్దరు నిందితులకు కోర్టు జీవితకాల ఖైదు విధించడంలో కీలకంగా వ్యవహరించిన బాచుపల్లి ఇన్‌స్పెక్టర్ ఉపేందర్‌కు సైబరాబాద్ కమిషనరేట్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సీపీ అవినాష్ మహంతి అప్రీషియేట్ సర్టిఫికేట్‌ను అందజేశారు. తలకొండపల్లి, ఆమంగల్ పీఎస్‌ల పరిధిలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన ఉపేందర్ నేరారోపణలు ఎదుర్కొన్న ఇద్దరు నిందితులకు శిక్షపడేలా ఇన్వెస్టిగేషన్ చేసి కోర్టుకు కీలక ఆధారాలు అందజేశారు. ఈ నేపథ్యంలో సీపీ ఆయన సేవలను కొనియాడుతూ సీఐ ఉపేందర్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

పార్కు అభివృద్ధికి కృషి చేయాలని మంత్రికి వినతి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అపెరల్ ఎక్స్‌పోర్ట్ పార్కులో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, అభివృద్ధి చేయాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ నాయకులు ఆదివారం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. నగరంలోని మంత్రి నివాసంలో ఆయనను కలిసిన ఐఎన్‌టీయూసీ నాయకులు అపెరల్ పార్కు ప్రస్తుత స్థితిని వివరించారు. పార్కులో ప్రస్తుతం కొందరు కంపెనీల ఏర్పాటుకు భూములు తీసుకుని నేటి వరకు ప్రారంభించడం లేదని, కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. అలాంటి వారి నుంచి ప్రభుత్వం భూములు తిరిగి తీసుకోవాలని గార్మెంట్స్ యూనిట్ ప్రారంభించే కంపెనీలకు అప్పగించాలని, స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు కావేరి శేఖర్, రాష్ట్ర కార్యదర్శి సురేష్ రెడ్డి, నాయకులు దొడ్ల మోహన్, మహిపాల్‌రెడ్డి, నవీన్ తదిదరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



మల్లాపూర్: అనేక ఏళ్లుగా రోడ్డు సరిగ్గా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నాచారం వీఎస్టీ కాలనీవాసుల కోసం రూ.55 లక్షలు మంజూరు చేయించిన ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డికి నాచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బందారం శ్రీకాంత్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం వీఎస్టీ కాలనీలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జి.కృష్ణారెడ్డి, ఎం.రాజిరెడ్డి, హెచ్ఆర్ మోహన్, మహేష్‌యాదవ్, రాజు, సంతోష్‌రెడ్డి, చందునాయక్, క్రాంతి, శ్రీధర్, వీఎస్టీ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

బూటకపు హామీలతో అధికారంలోకి కాంగ్రెస్


మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

జీడిమెట్ల: బూటకపు హామీలు ఇచ్చి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. 130 సుభాష్ నగర్ డివిజన్‌లోని వెంకటాద్రినగర్‌లో బీజేపీ నాయకుడు ఎం.ఎస్.వాసు అధ్యక్షతన ఆదివారం చేరికల కార్యక్రమం జరిగింది. రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ శ్రేణులు సుభాష్ నగర్ పైపులైన్ రోడ్డు నుంచి వేదిక వరకు ఘన స్వాగతం పలికారు. డివిజన్‌కు చెందిన పలు పార్టీల నాయకులు చిన్నస్వామితో పాటు వారి సతీమణి సెల్వరాణి, ప్రసన్నకుమార్, సురేశ్‌కుమార్, వారి మిత్రులు పార్టీలో చేరగా వారికి ఈటల రాజేందర్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకూ తగిన గౌరవం దక్కుతుందన్నారు. దేశంలోనే అతి శక్తవంతమైన పార్టీగా బీజేపీ ఉద్భవించిందని కొనియాడారు. పీఎం నరేంద్రమోడీ అధ్యక్షతన దేశం పురోగతిలో ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధిక స్థానాలు కైవసం చేసుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కంది శ్రీరాములు, హనుమాన్ కచావా, సౌరభ్ సింగ్, జనసేనా మహిళా నాయకురాలు లక్ష్మి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి దేశంలోనే అధిక సభ్యత్వం


బీజేపీ సభ్యత్వ నమోదులో పులిగొళ్ల శ్రీనివాస్ యాదవ్, నాయకులు


బాలాజీనగర్ డివిజన్‌లో శిల్పారెడ్డి, నాయకులు

మోతీనగర్: దేశంలోనే అధిక సభ్యత్వం గల పార్టీ బీజేపీ అని మేడ్చల్ జిల్లా బీజేపీ కార్యదర్శి పులిగొళ్ల శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆదేశాల మేరకు శ్రీ వివేకానందనగర్, గాయత్రీనగర్, పర్వత్‌నగర్, తులసీనగర్‌తో పాటు పలు బస్తీ కాలనీల్లో ఆదివారం ఇంటింటికీ తిరుగుతూ సభ్యత్వాన్ని నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హరికృష్ణ, శ్రీనివాస్, వసంత, వాసంతి, రఘు, చింటు, గోపి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవివేకానందనగర్ చౌరస్తాలో..

శ్రీ వివేకానందనగర్ చౌరస్తాలో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఆన్‌లైన్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, వెంకట్రామ్‌రెడ్డి, గోనెల సుదర్శన్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మూసాపేట డివిజన్‌లో..

మూసాపేట: మూసాపేట డివిజన్‌లో మేడ్చల్–మల్కాజిగిరి అర్బన్ జిల్లా కార్యదర్శి తూము శైలేష్‌కుమార్ ఆధ్వర్యంలో మూసాపేటలో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి హాజరై ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో మూసాపేట డివిజన్ అధ్యక్షుడు పిట్ల మనోహర్, సద్గుణ రెడ్డి, బీసీ నాయకులు నాగరాజు, శ్రీకర్ రావు, విజయభవానీ, శోభారాజన్, బీజేవైఎం నాయకులు సాయి, వాసవి, శ్రీకాంత్, శేషారావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజల చూపు బీజేపీ వైపు

కూకట్‌పల్లి: తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని రాష్ట్ర బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి అన్నారు. బాలానగర్ డివిజన్ అధ్యక్షుడు వినోద్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన సభ్యత్వ నమోదుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సూర్యారావు, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, శ్రేణులు గోపి, రాము, సోమశేఖర్, భగవంత్, అనిల్, సంతోష్, శేఖర్, సూరిబాబు, ప్రేమ్ కుమార్, వెంకటరమణ, జగదీష్, చలపతి, వినోద్, జ్యోతి, రేణుక, లహరి పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదులో బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి, నాయకులు


శ్రీవివేకానందనగర్ చౌరస్తాలో నాయకులు..

దర్గాను సందర్శించిన ఎమ్మెల్యే మాధవరం


ప్రార్థనల్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సతీశ్ గౌడ్

బాలానగర్: ఫతేనగర్ శాస్త్రినగర్‌లో ఉన్న హజ్రత్ సయ్యద్ అహ్మద్ కబీర్షా ఉరుసు కార్యక్రమంలో భాగంగా దర్గాని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ పండాల సతీశ్ గౌడ్ సందర్శించి పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు ఆరీఫ్, అసిఫ్, అఫ్జల్, జావేద్ ఖాజా, లల్లు ఖాజా, మహబూబ్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

గ్యార్మీ ఉత్సవాల్లో నాయకులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎన్‌టీఆర్‌నగర్, కేటీఆర్ కాలనీల్లో మైనార్టీ సోదరులు నిర్వహించిన గ్యార్మీ షరీఫ్ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు జిల్లా గణేశ్ నేత పాల్గొన్నారు. కార్యక్రమంలో రెహమాన్, రూబెన్, శివ, ఫజల్, మజర్, గౌస్, ఇస్మాయిల్, జాఫర్, కృపాకర్, మతపెద్దలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు

మోతీనగర్: సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో వివేక్ డెంటల్ సౌజన్యంతో గాయత్రీనగర్‌లో ఏర్పాటు చేసిన ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత దంత వైద్య శిబిరాన్ని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తరుచూ దంత పరీక్షలు చేయించుకుని, కాపాడుకోవాలని సూచించారు. క్యాంపు ఏర్పాటు చేసిన వైద్యుడు వివేక్‌ను అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ ఫోరం సభ్యులు సూరిబాబు, వెంకటేశ్వర్లు, సంజవరెడ్డి, జ్ఞానేశ్వర్, జాహేద్ షరీఫ్ బాబా, యోగి రాజు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనుల పరిశీలన


బీటీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్‌లోని వివేకానందనగర్‌కాలనీలో రూ. 55 లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు పనులను కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావలని సూచించారు. మరికొన్ని సీసీ రోడ్లు కూడా మంజూరయ్యాయని వాటిని కూడా త్వరలోనే ప్రారంభమయ్యేలా చూస్తామని పేర్కొన్నారు. సీవరేజ్ లైన్లు వేయాల్సి ఉన్నాయని, పనులు పూర్తి చేసిన అనంతరం రోడ్డు పనులు మంజూరు చేయించి కాలనీ ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు.

ఆలయంలో మహిళల పారాయణం


పారాయణం చేస్తున్న మహిళలతో శ్రీనివాస్‌యాదవ్

మోతీనగర్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని భూనీల సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ వ్యవస్థాపక చైర్మన్ పులిగొళ్ల శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. శ్రీ వివేకానందనగర్‌లోని ఆలయంలో ఆదివారం మహిళలు పారాయణం చేశారు. కార్యక్రమంలో పులిగొళ్ల అంజమ్మ, వరలక్ష్మి, వెంకటేశ్వరరావు, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక


మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో శేరి సతీశ్ రెడ్డి తదితరులు

కూకట్‌పల్లి: మూసీ అభివృద్ధిలో భాగంగా దక్షిణ కొరియాలోని సియోల్‌లో పర్యటన ముగించుకుని రాష్ట్రానికి వచ్చిన రెవెన్యూ, గృహనిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీశ్ రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్‌చారి, రాజు ముదిరాజ్, శేషగిరి నాయుడు, మొయిజ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జనరల్ బాడీ సమావేశం


మాట్లాడుతున్న సీపీఐ కార్యదర్శి మనోచారి తదితరులు

బాలానగర్: కూకట్‌పల్లి మండల పరిధిలోని శ్రీశ్రీనగర్‌లోని కార్యాలయంలో శ్రీశ్రీనగర్ సీపీఐ కార్యదర్శి కే మనోచారి అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి మండల సీపీఐ కార్యదర్శి కృష్ణ హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఆరు గ్యారంటీలను విస్మరించిందన్నారు. వెంటనే అమలుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే త్వరలో జరగబోయే సీపీఐ, ప్రజాసంఘాల మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కే. కృష్ణచారి, రాజుగౌడ్, దావిద్, నారాయణ, చంద్రమ్మ, ఉమారాణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.